క్లుప్తంగా

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ మండల శాఖ అధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశం కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాధవచారి, సినీయర్ నాయకులు పాపయ్య గౌడ్, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్ గౌడ్, దేశ్యా నాయక్, యాదయ్య, చెన్నారెడ్డి, భిక్షపతి, బుచ్చిబాబు, శ్రీను, శ్రీశైలం పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి న్యూ నందిహిల్స్ కాలనీ ఫేజ్–1 అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీనేత్రాలయ కంటి ఆస్పత్రి సహకారంతో ఆదివారం నందిహిల్స్ బస్టాప్ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది కంటి పరీక్షలు చేసుకొని, వైద్యుల సలహాలు, సూచనలు తీసుకున్నారని కాలనీ అధ్యక్షుడు చల్లా సురేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జిల్లెల కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు హము నాయక్, రామిడి నర్సిరెడ్డి, సూర్యనారాయణ, రంగారావు, శ్రీశైలం, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమణీయం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని అలకాపురంలోని శృంగేరి శంకర మఠంలోని శారదా చంద్రమౌళేశ్వర స్వామి ఆలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీశారదాంబ అమ్మవారిని మహాసరస్వతిగా అలంకరించారు. శారదాంబాదేవికి అష్టోత్తర శతకలశాభిషేకం(108), సుగంధ ద్రవ్యాలు, వివిధ నది జలాలతో విశేష అభిషేకం నిర్వహించారు. నారాయణసేవ, అన్న సంతర్పణ నిర్వహించారు. శృంగేరి శంకర మఠ బ్రాంచ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు రూ.60 వేల విరాళం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం పరిధిలోని ఇన్కమ్ టాక్స్ కాలనీకి చెందిన ఎస్ రాజేశ్ తన భార్య సృజన పుట్టిన రోజు సందర్భంగా విరాళం అందజేశారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ. 60 వేల చెక్కును అధ్యక్షులు మార్గం రాజేశ్ సమక్షంలో విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సృజన, ఆశ్రిత, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద నిలువకుండా చూడండి: కార్పొరేటర్

వనస్థలిపురం: కాలనీలల్లో వరదనీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం కురిసిన వర్షానికి డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్, రాజిరెడ్డినగర్, వెంకటరమణకాలనీలలో రోడ్లపై వరదనీరు చేరింది. దీంతో ఆయన కాలనీలలో పర్యటించి సిబ్బంది సహాయంతో జేసీబీలతో వరదనీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కాలనీల నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్/వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజారులలో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో).. టమాట 59, వంకాయ 35, బెండ 45, పచ్చి మిర్చి 70, కాకర 55, బీర 45, క్యాబేజి 28, ఫ్రెంచి బీన్స్ 105, క్యారెట్ 40, దొండ 26–35, చిక్కుడు 75, గోకర 50, బీట్‌రూట్ 28, క్యాప్సికం 70, ఆలు 35, దోస 23, చామగడ్డ 37. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డు పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

- మన్సాన్‌పల్లి చౌరస్తాలో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- పట్టించుకోని అధికారులు

మహేశ్వరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మన్లు విద్యుత్ అధికారులు రోడ్ల పక్కనే అమర్చడం, దానికి చుట్టూ రక్షణగా కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలోని పెండ్యాల వెళ్లే దారిలో రెడ్డి చికెన్ సెంటర్ ఎదుట రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టూ రక్షణగా కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. అసలే వర్షాకాలం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కనే ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎవరైనా ప్రమాదవశాత్తు తగిలితే విద్యుత్ షాక్ కొట్టే అవకాశం ఉంది. మన్సాన్‌పల్లి చౌరస్తాలో ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే దుకాణాలు ఉండడంతో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి, ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై మహేశ్వరం విద్యుత్ ఏఈ చక్రపాణిని వివరణ కోరగా.. మన్సాన్‌పల్లి చౌరస్తాలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణగా కంచె ఏర్పాటు చేసి తగు చర్యలు చేపడుతామని తెలిపారు.

యోగా చేయండి.. ఆరోగ్యంగా ఉండండి



యోగా ధ్యానం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గౌరీకృష్ణ తదితరులు

సహజ యోగా రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీకృష్ణ

హుడాకాంప్లెక్స్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సహజ యోగా రాష్ట్ర కో ఆర్డినేటర్ గౌరీ కృష్ణ అన్నారు. ఈ నెల 28వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న సహజ యోగా ధ్యానం పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మాతాజీ నిర్మలాదేవి స్థాపించిన సహజ యోగా నేడు సుమారు 170 దేశాలకు వ్యాప్తించి సహజ యోగా ధ్యాన కేంద్రాలను స్థాపించబడ్డాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కుల, మత, ప్రాంత, వయసుతో సంబంధం లేకుండా సహజ యోగా సాధన చేస్తూ శారీరక, మానసిక భావోద్వేగ సమస్యలను పరిష్కరించుకుంటూ ఆధ్యాత్మికతమైన సంతృప్తిని పొందుతున్నారని గౌరీకృష్ణ వెల్లడించారు. ప్రతి మనిషికి యోగా ద్వారా వచ్చే ప్రశాంతత, ఆనందాన్ని కలిగించడానికి హైదరాబాద్ రియలైజేషన్ టూర్‌ను నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్నారు. 26 నుంచి 30వ తేదీ నాలుగు రోజుల పాటు వరకు ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల కళాశాలలు, పాఠశాలల్లో చేపట్టబోయే కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు యోగా పరిచయం, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ సేషన్‌ను నిర్వహించనున్నామని, ఇందులో దేశ విదేశాల నుంచి ప్రజాప్రతినిధులు, అతిథులు పాల్గొననున్నారని వివరించారు. కార్యక్రమంలో మాజీ కో ఆర్డినేటర్లు మల్లారెడ్డి, రాంమోహన్ రావు, సుబ్బిరెడ్డి, కమిటీ సభ్యులు సుప్రజ, సభ్యులు సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సీతారామ్, సీఐ, కందుకూరు

కందుకూరు: కందుకూరు నూతన సీఐగా కె.సీతారామ్ ఆదివార బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఐదు నెలలుగా పని చేస్తున్న సీఐ ఎండీ మక్బూల్ జానీ సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐగా పని చేసిన సీతారామ్ శనివారం ఇక్కడికి వచ్చారు.

డొనేషన్ల పేరుతో దోపిడీ

- ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి
- బీజేవైఎం నేత శశిధర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో డొనేషన్ల పేరుతో విచ్చలవిడి దోపిడీకి పాల్పడుతున్నారని.. ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ కంబాలపల్లి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో డొనేషన్ల పేరుతో అక్రమంగా ఫీజులను వసూలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. పిల్లల భవిష్యత్ కోసం కొంతమంది తల్లిదండ్రులు ఆస్తులు అమ్ముకొని డొనేషన్లను చెల్లిస్తున్నారని, మరి కొంత మంది డొనేషన్లు చెల్లించలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండి వైఖరిని అవలంభిస్తోందని ఆరోపించారు. డొనేషన్ల పేరుతో అక్రమ దోపిడీలకు పాల్పడుతున్న ఇంజనీరింగ్ కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని.. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఇబ్రహీంపట్నం: దండుమైలారంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు సరైన వైద్య సేవలు అందకపోవడంతో రోగాలబారిన పడుతున్నారని, వారి తల్లిదండ్రులకు రోగాల నివారణ చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేసినట్లు హయత్‌నగర్ కేబీకే కలర్స్ చిల్డ్రన్ ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. కాగా వైద్య శిబిరంలో 159 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డా.వాసు, డా.నరేష్‌కుమార్ డా.విలియం, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల 1992 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

దిల్‌సుఖ్‌నగర్ : సరూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల 1992 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆర్కేపురం డివిజన్ మైసమ్మ దేవాలయ ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న నాటి మిత్రులంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో సుదర్శన్ యాదవ్, లింగం, శివకుమార్, రాజు, శ్యాంసుందర్, సురేందర్, ప్రేమ్‌గౌడ్, ఎస్‌కే మహమ్మద్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు అభివృద్ధికి నిధులు మంజూరు

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టడానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.16 లక్షలు మంజూరైనట్లు ఆమనగల్లు జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ తెలిపారు. హైదరాబాద్‌లోని జెడ్పీ కార్యాలయంలో ఆదివారం ఆమనగల్లు మండలానికి నిధులు మంజూరు చేస్తూ జిల్లా పరిషత్ చైర్మన్ అనితారెడ్డి ఉత్తర్వులు అందించారని ఆమె వివరించారు. మండల పరిధిలోని సీతారాంనగర్ తండా గ్రామ పరిధిలోని పులుగోనిపల్లి తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5లక్షలు, మేడిగడ్డతండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, రాంనుంతల గ్రామ పరిధిలోని పెద్దతాండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు, శంకరకొండ తండా గ్రామ పరిధిలోని కేశ్య తండాలో రోడ్డు నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరైనట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ తదితరులు ఉన్నారు.

దంచికొట్టిన వాన.. రోడ్లు జలమయం



ఓల్డ్ మలక్‌పేట్ కాలనీలో ట్రాఫిక్‌జాం కావడంతో వాహనదారుల ఇక్కట్లు



వరదనీటిలో చిక్కుకున్న వాహనదారుడు

ట్రాఫిక్ జాం – పొంగిపొర్లిన డ్రైనేజీలు

దిల్‌సుఖ్‌నగర్ : భారీ వర్షానికి మలక్‌పేట్ జోన్ పరిధిలోని పలు లోతట్టు కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు ఆదివారం జలమయమయ్యాయి. కాలనీలోని డ్రైనేజీలు రహదారులపై పొంగిపొర్లాయి.

- మలక్‌పేట్, నల్గొండ క్రాస్‌రోడ్డు, చాదర్‌ఘాట్ అల్కాపురి చౌరస్తా, కోత్తపేట్‌లలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది.
- దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, అక్బర్‌బాగ్, ఓల్డ్ మలక్‌పేట్, మున్సిపల్ కాలనీ, పద్మానగర్, కాలడేర, మలక్‌పేట్ రైల్వే బ్రిడ్జి, అజంపుర, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలు జలమయంగా మారాయి.
- మలక్‌పేట్, నల్గొండ క్రాస్‌రోడ్డు, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం తదిర ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం కావడంతో కొద్దిసేపు రోడ్డుపై వాహనాలు నిలిచాయి.
- వర్షాలకు పై ప్రాంతాల్లోని నాలాలు పూర్తిగా పూడుకుపోయి మురుగునీరంతా రోడ్లపై కాలనీల్లో ప్రవహిస్తోంది. నాలాలలో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టకపోవడంతో వరదనీరు ప్రవహించలేకపోతోంది. దీంతో కాలనీలు, బస్తీలు ముంపునకు గురయ్యాయి.

అన్నదాతలకు ఆర్థిక భరోసా



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఒకే దఫా రుణమాఫీ హర్షణీయం: కాంగ్రెస్ నేతలు
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కందుకూరు: అన్నదాతలకు రుణమాఫీ కల్పించి ఆర్థిక భరోసా కల్పించడం హర్షణీయమని కాంగ్రెస్ నేతలు అన్నారు. ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ మేరకు ఆదివారం కందుకూరులో.. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆ పార్టీ శ్రేణులు మాట్లాడారు. ఆగస్టు 15వ తేదీ వరకు ఒకే దఫాలో రూ.31వేల కోట్ల (ఒక్కో రైతుకు రూ2లక్షల చొప్పున) రుణమాఫీ చేయనుండటం శుభపరిణామమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫథకాలు అందేలా కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్ రెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, వైస్ ఎంపీపీ జి.శమంత ప్రభాకర్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ సులేమాన్, సీనియర్ నాయకులు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, సత్యనారాయణ, పాండు, వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగదీష్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్.జగన్, వెంకటేష్, కె.యుగంధర్‌గౌడ్, కుమార్, వి.బాబు, నర్సింహ, కృష్ణ, విజయ్, నవీన్‌గౌడ్, ఎస్.గణేశ్ నా యక్, ఎ.నర్సింహ, జి.సురేందర్‌రెడ్డి, ఎం.నర్సింహ, ఎస్.గోపాల్‌రెడ్డి, ఎం.శ్రీశైలం, రాములునాయక్, అనిల్, సుభాష్, పాండురంగారెడ్డి, మల్లేశ్, ప్రవీణ్‌నాయక్, శ్రీశైలం, రాజశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్ : సమస్యలు పరిష్కరించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీపాపిరెడ్డి కాలనీ వాసులు ఆదివారం రోడ్లపై నిలిచిన నీటిగుంట వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. కాలనీ సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ, సమస్యల పరిష్కారంలో చూపడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమమంలో బాలునాయక్, సోమయ్య, సుదర్శన్‌రెడ్డి, రాఘవేందర్, వెంకటేశ్వర్, ఉదయ్‌శ్రీ, ఉమాపతి, సాంబయ్య, దేవాదాసు, బ్రహ్మాచారి, రామకృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



హయత్‌నగర్ కుమ్మరికుంట రోడ్డు దుస్థితి

- వర్షంతో బురదమయంగా కుమ్మరికుంట కట్ట
- బీటీ రోడ్డు వేయాలని స్థానికుల వినతి

హయత్‌నగర్ : అది హయత్‌నగర్–సాహెబ్‌నగర్‌కు లింకు రోడ్డు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే రహదారి. పదుల సంఖ్యలో కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డు. కానీ చినుకు పడితే రోడ్డంతా చిత్తడే. అదే కుమ్మరికుంట కట్టపై నుంచి వెళ్లే రోడ్డు. హయత్‌నగర్ కుమ్మరికుంటపై నుంచి వెళ్లే రోడ్డు మట్టితో ఉంది. ఏమాత్రం వర్షం వచ్చినా రోడ్డంతా బురదమయంగా మారుతుంది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు జారీ పడుతున్నారు. రోడ్డును వెడల్పు చేసి బీటీ వేయాలని కొన్నేళ్లుగా స్థానికులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కట్టను పటిష్టం చేసే క్రమంలో పనులు చేపట్టినా పనులు చేయడంలో జాప్యం కారణంగా పరిస్థితి మారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుమ్మరికుంటపై రోడ్డును వెడల్పు చేసి బీటీ వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కేజీబీవీ భవనాన్ని ప్రారంభించండి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా.. నిర్మాణం పూర్తయిన కేజీబీవీ పాఠశాల భవనాన్ని ఎందుకు ప్రారంభించడం లేదని సంబంధిత అధికారులను జెడ్పీటీసీ దశరథ్ నాయక్ ప్రశ్నించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్న కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు పడుతున్న కష్టాలను ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేజీబీవీ పాఠశాలకు సొంత భవన నిర్మాణానికి కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై పదిహేను రోజులు కావస్తున్నా.. నిర్మాణం పూర్తయిన పాఠశాల భవనాన్ని ప్రారంభించడానికి జాప్యం ఎందుకు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడిచినా విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఒక వేళ పాఠశాల ప్రారంభానికి ప్రొటోకాల్ ఇబ్బందిగా మారితే జెడ్పీటీసీ పదవిని వదులుకోడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. పాఠశాల ప్రారంభం కాలేదని, సీట్లు లేవని విద్యార్థులకు సాకులు చెప్పి ఆమనగల్లు, కందుకూర్ మండలాలకు పంపిస్తున్నారని జెడ్పీటీసీ ఆరోపించారు. పాఠశాల నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించకపోతే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు కోఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, తులసీరాం, భూనాథ్, నర్సింహగౌడ్, జంగయ్య, సాయిలు, సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు.. నర్సింహ, రాంచంద్రయ్య, శ్రీను, కృష్ణ,గోపాల్, అంజి తదితరులు ఉన్నారు.